# మధుర స్మృతి



యర్రంశెట్టి శాయి

"ఏమిటి-మళ్ళీ నవ్వుతున్నావా?"

మాధవి చేయిపట్టుకుని సున్నితంగా మెలితిప్పుతూ అన్నాడు గోపాల్రావ్.

"అమ్మో! చేయినొప్పి! నవ్వనులే-వదలండి!" నవ్వాపుకుంటూ చేయి వదిలించుకోడానికి ప్రయత్నించసాగిందామె.

అతను ఆమె చేయి వదిలేసి అద్దం ముందు నిలబడి తల దువ్వుకున్నాడు.

తలుపుపక్కనే నిలబడి అతనివంకే చిలిపిగా చూడసాగిందామె.

"ఇంకేమయినా మర్చిపోయానా?" ఆమెకు అభిముఖంగా నిలబడి అడిగాడతను.

"ఏమీలేదు "

"సరే-తర్వాత-ఇదిగో, ఇది మర్చిపోయారు" అంటూ "నవ్వావంటే మర్యాదగా ఉండదు "

ఆమె బుగ్గగిల్లి బయటకు నడిచాడతను.

"సాయంత్రం పెందలాడే చేరుకోవడం మర్చిపోకండి "


"అలాంటి విషయాలు మర్చిపోవడమా? ఇంకేమయినా ఉందా? రెండు రోజులు నీతో యుద్ధంచేసే ఓపిక లేదులే నాకు" నవ్వుతూ అన్నాడతను.

మాధవికూడా నవ్వేసింది.

"ఓకే-బై " అంటూ ఆఫీస్‌కి వెళ్ళిపోయాడతను.

హాల్లో పడక్కుర్చీలో పడుకుని మాసపత్రిక చూడసాగిందామె. ఒక్కొక్క పేజీ తిరగేస్తూంటే హఠాత్తుగా ఓ పేజీ దగ్గర ఆమె దృష్టి నిలిచిపోయింది. ఆ పేజీలో ఆ కథకు సంబంధించిన బొమ్మ ఉంది. షుమారు పద్నాలుగేళ్ళ వయసున్న ఓ అమ్మాయి, మరో అదే వయసు కుర్రాడూ సముద్రపు ఒడ్డున ఎదురెదురుగ్గా కూర్చుని సముద్రపు శంఖువులు ఏరుతున్నారు.

ఆ బొమ్మ చూస్తూనే మనసు ఒక్కసారిగా చలించిపోయింది. ఎన్నో సంవత్సరాలనాటి మధురస్మృతులు మనసు అట్టడుగునుంచి పైకి లేచినయ్.



గుండెలు బాధతో మూలిగినయ్

ఎన్నేళ్ళ కిందటి సంగతది?

తను ఎలా మర్చిపోగలిగిందా రోజుల్ని?

అతని పేరు తనకు తెలీదు.

అందరూ 'చిన్నా' అని పిలిచేవాళ్ళు. ఇద్దరూ సాయంత్రాలు సముద్రతీరంలో గంటల తరబడి శంఖువులు, రంగు రంగుల గవ్వలు ఏరుతూ గడిపేవాళ్ళు.

ఆ కథ చదవాలనిపించింది మాధవికి.

ఆత్రుతగా చదవ సాగింది

విజావిళది కథకాదు హీరో గతాన్ని గుర్తుచేసుకోవడం। అతను సముద్రపు ఒడ్డున ఓ పల్లెటూళ్ళో గడిపిన బాల్యం, అప్పుడు సరుగుడు చెట్లమధ్య ఆడుకున్న ఆటలు, సముద్రపు ఒడ్డున వెన్నెల్లో గడిపిన రోజులు- ఆ తరువాత వేసవి శెలవులకు మాధవి అనే అమ్మాయి ఆ ఊరురావడం-

ఉలిక్కిపడింది మాధవి.

ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నయ్.

ఏమిటిది? తనగురించే. తనపేరే అది- తనూ వేసవిశెలవులకి ఆ ఊరు వెళ్ళింది!

ఎవర్రాశారా కథ?

అత్రుతగా రచయిత పేరుకోసం వెది కిందామె.

'చిన్న' అని ఉందక్కడ.

మాధవి చలించిపోయింది. మనసంతా అదోలాఅయిపోయింది. ఇన్నేళ్ళతరువాత కూడా చిన్నా ఆ రోజుల్ని ఎంతో భద్రంగా గుండెల్లో దాచుకుని ఇప్పుడిలా కథగా ఎందుకు మలచాడు? అతని హృదయంలో తను అలాగే నిలబడిపోయిందా? తనను మరచిపోలేకపోతున్నాడా?

ఆమె కథంతా త్వరత్వరగా చదవ సాగింది.

కథంతా వర్ణనలే! ఎన్నో సుందర మయిన సముద్రతీర దృశ్యాలను కళ్ళకు కట్టినట్లు వర్ణించాడతను.

కథ మధ్యలో తన గురించి రాశాడు గానీ ఆ తరువాత తన ప్రసక్తి లేదు. ఇంతకూ అతనిప్పుడు ఎక్కడున్నాడో? ఓసారి తనని కలుసుకుంటే? 'పోనీ ఓ ఉత్తరం రాస్తే!

ఎలా? అడ్రసెక్కడ లభిస్తుంది?

ఆ పత్రికవాళ్ళకురాస్తే అడ్రసిస్తారు.

అయినా తను ఉత్తరం రాస్తే బావుంటుందా? అతనేమనుకుంటాడో? తను స్వయంగా అతనిని కలుసు కుంటేనే సరదాగా ఉంటుందేమో!

అతనెంతో మంచివాడు. తను వేసవి సెలవులకు రెండునెలలు మంగనపూడి లోనే ఉండిపోయింది. తను పిన్నివాళ్ళ పక్కింట్లోనే చిన్ని ఉండేవాడు. ఆ కొద్ది రోజుల్లోనే ఇద్దరూ మంచిస్నేహితులయి పోయేరు. తనను రోజూ సాయంత్రాలు సముద్రపు తీరానికి తీసుకెళ్ళి రంగు రంగుల గవ్వలు, శంఖువులు ఏరి ఇస్తూండేవాడు. అసలా ఊరు వదలి వెళ్ళబుద్ధికాలేదు తనకు. చిన్న స్నేహం అంత మధురంగానూ, అద్భుతంగానూ అనిపించింది. ఆ తర్వాత క్రమేపీ రోజులు గడుస్తున్నకొద్దీ అతనూ, ఆ మధురస్మృతులూ కూడా మరుగున పడిపోయినయ్. ఇప్పుడు చిన్న రాసిన కథ మళ్ళీ ఇన్నేళ్ళకు తనను పన్నెండేళ్ళ వెనక్కి లాక్కెళ్ళింది.

అలా ఎంతసేపు ఆలోచనల్లో పడి పోయిందో ఆమెకే తెలీదు. చివరకు ఆలోచనలు కట్టిపెట్టి ఉత్తరం రాయడం ప్రారంభించింది. గంటసేపు గడిచినా కొట్టివేతలు తప్పితే ఒక్క వాక్యం కూడా పూర్తికాలేదు.

"ఏం టోయ్! చాలా శ్రమపడి రాస్తున్నావ్?" అంటూ గోపాల్రావ్ పలుకరించే వరకూ ఈ లోకంలోకి రాలేకపోయిందామె.

వెంటనే ఉత్తరం చింపి పడేసింది అక్కడే.

"బాగుందోయ్! ఇంకెప్పుడు నేర్చు కుంటావ్ ఉత్తరాలు రాయడం? ఒక లైను రాయడానికి అన్ని కొట్టివేతలా? అది సరేగాని నన్ను పెందలాడేరమ్మని

నవ్వు చేస్తున్న నిర్వాకమేమిటి? త్వరగా రెడీ అవు మరి!" నవ్వుతూ అన్నాడతను.

త్వరగా రెడీఅయి అతనితోపాటు బయ ల్దేరిందామె.

ఇద్దరూ రిక్షాలో సినిమాహాలు చేరు కున్నారు.

"నువ్విక్కడే నిలబడు ? నేను వెళ్ళి టిక్కెట్లు తెస్తాను " బుకింగ్ విండో వైపు వెళ్ళాడు గోపాల్రావ్.

ఆమె మనసులో ఆలోచనలు ఇంక ముసురుతూనే ఉన్నాయ్.

గోపాల్రావ్ తిరిగివచ్చాడు.

"ఓసారి తప్పట్లు కొట్టు పాపా" అన్నాడు నవ్వుతూ.

"ఎందుకూ ?"

"టికెట్స్ అయిపోయాయ్ ?"

"మరి ఎలా?"

"ఎలాగేమిటి ? వెధవ టిక్కెట్లు దొరక్కపోతే మనకేం భయమా ? హాయిగా ఎంచక్కా వెన్నెల్లో కబుర్లు చెప్పుకుంటూ, బజార్లో మాంఛి హోటల్ కెళ్ళి టిఫిన్ తిని అందమయిన కూల్ డ్రింక్‌లు తాగి— "

"చాల్లేండి ? ఇంక పదండి మరి " నవ్వాపుకుంటూ అంది మాధవి.

ఇద్దరూ రోడ్డుమీద నడుస్తున్నారు.

గోపాల్రావ్ ఏదో తమాషా విష యాలు నవ్వుతూ చెప్తున్నాడు. అతనలా మాట్లాడుతూంటే ఎంతసేపయినా వినా లని ఉంటుంది ఆ క్షణంలో చిన్న గురించిన ఆలోచనలు మాయమయి పోయినయ్.

అవును ! ఇప్పుడు తనకు సర్వస్వం గోపాల్రావ్ ! చిన్నతో తను గడిపిన రోజులు కేవలం ఆ రోజులను గుర్తు తెచ్చుకునే మధుర సంఘటనలు ! అవి తలుచుకుని ఆనందించడమే గాని అంతకు మించి ఎలాంటి విలువా ఉండదిప్పుడు.

తను చిన్నకి ఉత్తరం రాసినా, అతనిని కలుసుకున్నా ఆనాటి అను భూతిని తిరిగి పొందలేదు. అతనికి అంతే! కేవలం తన గురించి తలుచు కోడమో, ఆ రోజుల్ని మననం చేసుకుని ఆనందించడమో తప్పితే మరో ఆలో చన ఉండదు. ఒకవేళ తను కనబడినా కూడా ఆ చిన్ననాటి చనువూ, స్నేహం ప్రదర్శించడం ఇద్దరికీ సాధ్యంకాని విషయం. మధురస్మృతులనేవి ఎప్పటికీ మధురస్మృతులుగానే మిగిలిపోవాలి. వాటిని మళ్ళీ తిరిగి అనుభవించాలను కోవడం బంగారు గుడ్లుపెట్టే బాతుని చంపుకోవడమే అవుతుంది.

ఆ మరుక్షణంలో చిన్నని, అతను రాసిన కథనూ అన్నీ మనసు అడుగుకి తోసేసింది మాధవి.

గోపాల్రావ్ చెప్పే మాటలలో పూర్తిగా లీనమయిపోయిందామె.